క్లుప్తంగా

నాదెండ్ల తహసీల్దార్‌గా కుటుంబరావు



నాదెండ్ల: మండల తహసీల్దార్‌గా వైవీవీ కుటుంబరావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన గురజాల తహసీల్దార్‌గా పనిచేస్తూ సెలవుపై వెళ్లారు. సెలవు ముగియటంతో జిల్లా కలెక్టర్ ఆయన్ను నాదెండ్ల మండల తహసీల్దార్‌గా బదిలీపై పంపారు. గతంలో కుటుంబరావు నాదెండ్ల ఆర్ఐగా, యడ్లపాడు తహసీల్దార్‌గా పనిచేశారు. బాధ్యతలు చేపట్టిన కుటుంబరావుకు డీటీ సల్మాన్, సర్వేయర్ రాంబాబు, వీఆర్వోలు, వివిధ శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన చంద్రశేఖర్ గత నెల 13న అచ్చంపేటకు బదిలీ అయ్యారు.

జీఎస్టీ తగ్గింపుతో రవాణా రంగానికి మేలు

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



చిలకలూరిపేట: జీఎస్టీ తగ్గింపు రవాణా రంగానికి మేలు చేస్తుందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపుపై లైట్ కమర్షియల్ వెహికిల్స్ ర్యాలీని గురువారం నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ చైర్మన్ రఫాని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1500 సీసీ సామర్థ్యం కలిగిన వాహనాలపై జీఎస్టీని 28 నుంచి 18 శాతానికి తగ్గించటం వలన రవాణా రంగానికి తోడ్పాటు అందించినట్లు అవుతుందని వెల్లడించారు. ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రారంభమై గడియార స్తంభం సెంటర్, కళామందిర్ సెంటర్ మీదుగా ఎన్ఆర్‌టీ సెంటర్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్ గోపాల్, జీఎస్టీ అధికారి నిత్యానందం, రవాణా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



వినుకొండ: పట్టణంలోని విద్యావికాస్ స్కూల్‌లో ప్రపంచ ఆహార దినోత్సవం, స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, బహిరంగ మలమూత్ర విసర్జన నివారణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలు, ఆహారం ఉత్పత్తి చేయడంలో ఎదుర్కొనే సవాళ్ల తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛాంధ్రపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ టి.బాలయ్య, ప్రిన్సిపాల్ ఎం.సాంబశివరావు, మున్సిపల్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కవి కరిముల్లాకు అబ్దుల్ కలాం సేవా పురస్కారం



వినుకొండ: పట్టణానికి చెందిన ప్రసిద్ధ కవి కరిముల్లా అబ్దుల్ కలాం సేవా పురస్కారం పొందారు. మాచర్లలో జరిగిన ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సభలో అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షుడు పాషావలి ఆధ్వర్యంలో మద్రాస్ యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతి ప్రొఫెసర్ మాడభూషి సంపత్ కుమార్ చేతుల మీదుగా కవి కరిముల్లాను ఘనంగా సన్మానించి పురస్కారం అందజేశారు. కరిముల్లా కవిత్వం ఆంగ్లం, కన్నడ, హిందీ, ఒరియా, ఉర్దూ భాషల్లో అనువదించబడి విఖ్యాతి పొందిందని కొనియాడారు. పురస్కారం పొందిన కరిముల్లాను పట్టణానికి చెందిన కవులు, కళాకారులు అభినందించారు.



కూటమి పాలనలో అన్ని వర్గాల్లో అసంతృప్తి

- వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- ఉప్పలపాడులో వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి పుల్లారెడ్డి సన్మాన కార్యక్రమం



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి పుల్లారెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నరసరావుపేట రూరల్: కూటమి 16 నెలల పాలనలో అన్ని వర్గాలు అసంతృప్తితో రగిలిపోతున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన కనకా పుల్లారెడ్డి సన్మాన కార్యక్రమం బుధవారం రాత్రి మండలంలోని ఉప్పలపాడులో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ కూటమి పాలనలో ఏ ఒక్కరు సంతృప్తిగా లేరని తెలిపారు. ఉపాధ్యాయులు, వైద్యులు, విద్యుత్ ఉద్యోగులు తమ డిమాండ్ల కోసం రోడ్ల మీదకు వచ్చారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యూరియా కోసం రైతులు క్యూలైన్‌లో నిలబడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. బకాయిలు చెల్లించకపోవడంతో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు వైద్య సేవలు నిలిపివేసాయని వివరించారు. ప్రతి రోజు 8 వేల ఆపరేషన్‌లు ఆరోగ్యశ్రీలో జరుగుతుంటాయని, ప్రస్తుతం 2 వేల ఆపరేషన్‌లు మాత్రమే మెడికల్ కళాశాలల్లో జరుగుతున్నాయని వివరించారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలోని పేదలందరికీ న్యాయం చేసిన నాయకుడు వైఎస్ జగన్ అని తెలిపారు. జగన్ 2.0 పాలనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని, దీనికి పుల్లారెడ్డిని రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించడమే నిదర్శనమన్నారు. కనకా పుల్లారెడ్డి మాట్లాడుతూ పదవి అంటే అలంకారం కాదని, దానిని బాధ్యతగా తీసుకుని వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి వచ్చేందుకు కారణమైన డాక్టర్ గోపిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ హనిమిరెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ యన్నం నర్సిరెడ్డి, యన్నం రాధాకృష్ణారెడ్డి, డి.సుబ్బారెడ్డి, శనివారపు సుబ్బారెడ్డి, శనివారపు వాసుదేవరెడ్డి, శనివారపు వీరారెడ్డి, ఖాజావలి మాస్టారు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కె కరీముల్లా, జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మ, నరసరావుపేట, రొంపిచర్ల మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అరవిందబాబు అబద్ధాలు మానలేదు

నరసరావుపేట: గత ప్రభుత్వంలో తాను మద్యం బాటిల్‌కు రూ.20 వసూలు చేశానని, ప్రభుత్వ భూమిని ఆక్రమించానంటూ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తనపై అనేక అబద్ధాలు ప్రచారం చేస్తున్నాడని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడారు. టిడ్కో గృహాలకు ఓవర్‌హెడ్ ట్యాంకు, సీసీ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు తానే ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ముందు ఇటీవల అబద్ధాలు చెప్పాడని అన్నారు. అతను అధికారంలోకి రాగానే తనపై చేసిన ఆరోపణలు రుజువు చేయాలని మీడియా ద్వారా తాను బహిరంగ సవాల్ విసిరానని, 16 నెలలు గడిచినా చర్యలు తీసుకోలేదని అన్నారు. గత ప్రభుత్వంలో టిడ్కో వాసుల కోసం రూ.14 కోట్ల వ్యయంతో ఓవర్‌హెడ్ మంచినీటి ట్యాంకు, మెయిన్ రోడ్డు నుంచి గృహాల వరకు సీసీ రోడ్లు, డ్రెయిన్లు, 64 ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. 600 మంది నివాసితులకు తాళాలు అందజేశామన్నారు. జగనన్న కాలనీ, టిడ్కో గృహాల వద్ద ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్లలో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లను తొలగించి తన మనుషులను పెట్టుకున్న వ్యక్తి అరవిందబాబు అని అన్నారు. కూటమి ప్రభుత్వంలో వైన్‌షాపులకు టెండర్లు పిలిస్తే మాజీ టీడీపీ కౌన్సిలర్‌కు వచ్చిన ఐదు వైన్‌షాపులలో ఒక షాపును బెదిరించి లాక్కొని తాను నిర్వహిస్తూ దోచుకుంటున్నాడన్నారు. గీత కార్మికులకు కేటాయించిన బార్ అండ్ రెస్టారెంట్‌ను తన అనుమాయులచే నిర్వహిస్తున్నాడన్నారు. కోటప్పకొండ ఈనాం భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తుంటే విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తేగాని ఆపలేదని అన్నారు. నకిలీ మద్యంపై తాము నిరసన ప్రదర్శన చేశామని, తనతో పాటు 22 మందిపై కేసు పెట్టారని, ఎన్నికేసులు పెట్టుకున్నా భయపడేది లేదని అన్నారు. యాప్‌ను వినియోగదారులు ఉపయోగించాలంటూ ప్రభుత్వం చెబుతున్నదంటే పరోక్షంగా నకిలీ, అసలేదో మీరే కనుగొనండని కోరటమేనని అన్నారు. గాలివాటంగా గెలిచిన అరవిందబాబుకు దమ్ముంటే మళ్లీ నరసరావుపేట నుంచే పోటీ చేయాలని సవాల్ విసిరారు. ప్రజలు చేసిన తప్పును తెలుసుకున్నారని, ఈసారి అతనికి డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు.

ప్రత్తిపాడు ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

డిమాండ్ చేసిన మాల మహానాడు నాయకులు



సమావేశంలో మాల మహానాడు నాయకులు

నరసరావుపేట: గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం తురకపాలెం గ్రామంలో కలుషిత నీరు తాగి మృతి చెందిన వారిపై స్థానిక శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి గోదా బాల మాట్లాడుతూ సుమారు 28 మంది మాలలు మృతి చెందితే వారు జగన్ మద్యం తాగి, ఎయిడ్స్ రోగంతో చనిపోయారంటూ వారి మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడటం ఏమాత్రం సముచితం కాదని అన్నారు. మృతి చెందిన వారిని ఒక పార్టీ కార్యకర్తలుగా ముద్రవేసి వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సహకారాలు అందించకుండా చేసిన ప్రయత్నాలను జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ అడ్డుకున్నారన్నారు. నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ వుస్తెల జయరావు మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు అంబేడ్కర్ భిక్షతోనే శాసనసభ్యుడు అయ్యారనే విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. తోటి దళిత నాయకులను అవమానపరిచే విధంగా దళారులు అనటం కరెక్ట్ కాదని అన్నారు. తురకపాలెం బాధితులను అణచివేసే కుట్ర నడుస్తుందని, ఇప్పుడు ఎమ్మెల్యేకి మద్దతుగా మాట్లాడుతున్న కొన్ని సంఘాలు జాతీయ అధ్యక్షుడు అరుణ్‌కుమార్‌పై మాట్లాడుతున్న భాష మార్చుకోకపోతే సమాజంలో విలువలు కోల్పోతారని హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంటనే దళిత సంఘాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సేవా సామేలు, గోల నీలంబరం, కొండ ప్రకాష్ పాల్గొన్నారు.

గిరిజన గురుకులాల్లో వసతులు మెరుగుపరచాలి

గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనునాయక్

చిలకలూరిపేట: గిరిజన గురుకులాల్లో వసతుల మెరుగుకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి చిత్తశుద్ధితో కృషి చేయాలని సీపీఐ అనుబంధ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీనునాయక్ కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన వసతి గృహాల్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని గిరిజన గురుకులాలు, వసతి గృహాలను గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సందర్శించాలని కోరారు. గిరిజన పాఠశాలల భవనాలకు నిధులు ఎందుకు కేటాయించటం లేదో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. మన్యం జిల్లాలోని కురుపాంలో అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించిన గిరిజన శాఖ మంత్రి మరుగుదొడ్ల వలన రోగాలు వ్యాపిస్తున్నాయని చెప్పడం పరిస్థితులకు అద్దం పట్టిందన్నారు. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టి గిరిజన గురుకులాలు, వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

పాలిథిన్ వాడకంతో పర్యావరణం కలుషితం



సీజ్ చేసిన పాలిథిన్ వస్తువులు చూపుతున్న కమిషనర్ ఆనంద్ కుమార్, ఎస్ఐ విజయసారథి

సత్తెనపల్లి: పాలిథిన్ వాడడం వలన పర్యావరణం కలుషితం అవుతుందని సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనంద్ కుమార్ అన్నారు. స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం పురపాలక సంఘ కార్యాలయం నుంచి గార్లపాడు బస్టాండ్ వద్ద గల మాతాజీ హోల్‌సేల్ పాలిథిన్ షాపు, ఇతర రిటైల్ పండ్ల బళ్ల వారిపై పురపాలక సంఘ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 40 కేజీల పాలిథిన్ వస్తువులు పట్టుబడటంతో వాటిని సీజ్ చేసి మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ పాలిథిన్ వలన పర్యావరణం కలుషితం అవుతుందని అనేక అధ్యయనాల ప్రకారం జీవి మనుగడ కొనసాగడానికి పాలిథిన్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు. పట్టణ ప్రజలు, వ్యాపార సంస్థలు అవగాహన కలిగి వాటిని నిషేధించేందుకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయసారథి, శానిటరీ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రులు పాల్గొన్నారు.

వాహనమిత్ర అర్జీలపై కూటమి నేతల పెత్తనం

ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట రూరల్: అర్జీని పక్కనపెట్టి వాహనమిత్ర అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించిన కేసానుపల్లి సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో టీవీ కృష్ణకుమారికి గురువారం వినతిపత్రం అందజేశారు. కేసానుపల్లి పంచాయతీ పరిధిలోని లలితాదేవి కాలనీలో మన్యం హుస్సేన్ గత 25 సంవత్సరాలుగా జీవనోపాధి కోసం ఆటో నడుపుతున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన వాహనమిత్ర పథకం కోసం ఆటో రిజిస్ట్రేషన్, లైసెన్స్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలతో గత నెల 20వ తేదీన సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. రాజకీయ కారణాలతో సచివాలయ సిబ్బంది అర్జీని ఆన్‌లైన్ చేయలేదు. దీనిపై ఎంపీడీవోకు అర్జీలు పెట్టినా స్పందించకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అర్హుడైన బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అయినా అధికారులు స్పందించకపోవడంపై ఎంపీడీవో కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కేసానుపల్లి పరిధిలో ఐదుగురు అర్హులైన లబ్ధిదారులకు వాహనమిత్ర అందకుండా కూటమి నాయకులు అడ్డుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణ.. సంపద సృష్టిపై దృష్టి సారించండి

ఎంపీడీవో హేమలతాదేవి



శిక్షణ అనంతరం అధికారులు, డ్వాక్రా సంఘాల లీడర్లు

యడ్లపాడు: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్వచ్ఛత అవగాహనపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో మండలం పరిధిలోని డ్వాక్రా సంఘాల లీడర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వి.హేమలతాదేవి మాట్లాడుతూ... చెత్త నిర్వహణ, సంపద సృష్టిపై అధికారులు దృష్టి సారించాలన్నారు.

చెత్తను కేవలం వ్యర్థంగా చూడకుండా, దాని నుంచి సంపదను సృష్టించే పద్ధతులను నేర్చుకోవాలని, అలాగే ఇంటిలో పనికిరాని వస్తువులను కూడా సృజనాత్మకంగా ఉపయోగించి, ఇంటి అవసరాలు తీర్చుకునే పద్ధతిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఆమె సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేయడంలో ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, ఇది పరిసరాల పరిశుభ్రతకు మొదటి మెట్టు అని తెలిపారు. అనంతరం వెలుగు ఏపీఎం రవీంద్రనాథ్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం, లక్ష్య సాధనకు అనుసరించాల్సిన విధానాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ షేక్ జాకీర్‌హుస్సేన్, వెలుగు సీసీలు, 12 గ్రామ సచివాలయాల కార్యదర్శులు, వీవోఏలు, డ్వాక్రా సంఘాల లీడర్స్ పాల్గొన్నారు.

బాలిక దినోత్సవ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీడీవో మాధురి, ఎంఈవో పార్వతి

బొల్లాపల్లి: బాలిక దినోత్సవం రోజున కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో విద్యార్థినులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బహుమతులు అందజేశారు. ఎంపీడీవో పి.మాధురి, ఎంఈవో కె.పార్వతి చేతుల మీదుగా బహుమతులు అందజేసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.శ్రీదేవి తెలిపారు. బాలికలను రక్షిద్దాం, చదివిద్దాం, బాలిక విద్యను ప్రోత్సహించాలని, బాల్య వివాహాలను అరికట్టాలని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని వారు చెప్పారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం, చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బొల్లాపల్లి మెయిన్ సెంటర్ వద్ద సూపర్‌వైజర్ తినటానికి ముందు చేతులను శుభ్రపరచుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పోషకాహారం ప్రతి ఒక్కరు సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాలింతలు, గర్భిణులు, చిన్నారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని వినతి



చిలకలూరిపేట: ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు ఎస్టీయూ నాయకులు గురువారం ఎంఈవో బి.సత్యనారాయణసింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్, మండల పరిషత్ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్లను క్రమబద్ధీకరించాలని కోరారు. పెండింగ్ బకాయిలు, సెలవుల తాలూకు బిల్లులు, ఎల్ఐసీ బిల్లులు త్వరగా మంజూరు చేయాలని కోరారు. వేసవి సెలవుల్లో చేసిన సంపాదిత సెలవులను సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. సింగిల్ టీచర్ స్కూళ్లలో ఉపాధ్యాయులు సెలవు పెట్టినప్పుడు సర్దుబాటు చేయాలన్నారు. డీఎస్సీలో నూతనంగా క్లస్టర్‌లో వచ్చిన ఉపాధ్యాయులను విద్యార్థుల సంఖ్య ఆధారంగా సర్దుబాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ పట్టణ అధ్యక్షుడు మేకల కోటేశ్వరరావు, నాయకులు బొంతా రవి, షేక్ మస్తాన్‌వలి, పోటు శ్రీనివాసరావు, వి.రమణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ



చిలకలూరిపేటటౌన్: ప్రపంచ ఆహార దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని ప్రశాంతి వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకుల్ని పంపిణీ చేశారు. యడ్లపాడు మండలం తిమ్మాపురంకు చెందిన నరేంద్ర సువర్ణకుమారి ఫౌండేషన్ అధ్యక్షురాలు నరేంద్ర సువర్ణకుమారి ప్రపంచ ఆహార దినోత్సవం విశిష్టతను తెలియజేశారు. స్థిరమైన, సమానమైన ఆహారాన్ని అందరికీ అందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, పండ్లు ఆశ్రమ నిర్వాహకులు షేక్ అమీనాకు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు ఏండేటి ప్రసాదరావు, నరేంద్ర ప్రణీత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సాంస్కృతిక పోటీలు

శావల్యాపురం: రాష్ట్ర స్థాయిలో ఉపాధ్యాయులకు సాంస్కృతిక పోటీలు నవంబరు 8, 9 తేదీల్లో నిర్వహించనున్నట్లు వినుకొండ నియోజవర్గ బాలోత్సవ కమిటీ సభ్యులు సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ వెంకట నాగేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ నరసరావుపేట పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో వేడుకలు జరుగుతాయని మొదటి రోజు శాస్త్రీయ నృత్యం, నాటికలు, దేశభక్తి గీతాలు, బుర్రకథలు జరుగుతాయన్నారు. రెండవ రోజు జానపద నృత్యం, ఏకపాత్రాభినయం, మైమ్, కోలాటం, పద్యాలు, కవితలు తదితర పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పల్నాడు బాలోత్సవ కమిటీ సభ్యుల సారథ్యంలో రెండు రోజుల పాటు ఉచిత భోజన వసతి కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పోటీలకు ప్రత్యేక రుసుము లేదన్నారు. పోటీల్లో సినిమా పాటలు నిషేధమన్నారు. చివరిరోజు సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేస్తామని, ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యడ్లపాడు: మండలంలోని పుట్టకోట గ్రామంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని చిలకలూరిపేట విద్యుత్ శాఖ డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. ఆర్డీఎస్ఎస్ పనులలో భాగంగా విద్యుత్ లైన్లు, మరమ్మతులు చేపట్టనున్నందున ఈ అంతరాయం ఏర్పడుతుందని, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గృహ, వాణిజ్య, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయబడుతుందని ప్రకటించారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయాన్ని గమనించి సహకరించాలని డీఈఈ అశోక్‌కుమార్ కోరారు.

మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఫిరోజ్ గురువారం తెలిపారు. పిడుగురాళ్ల మండలం జూలకల్లు గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక నరసరావుపేట పట్టణంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 14వ తేదీ కళాశాల నుంచి ఇంటికి బయలుదేరిన ఆమె రాలేదు. కుటుంబ సభ్యులు బాలిక కోసం గాలించినా ఫలితం దక్కలేదు. ఈ మేరకు బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎన్‌సీసీ సెలక్షన్స్‌కు విశేష స్పందన



నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎన్‌సీసీ సెలక్షన్స్‌కు యువత నుంచి విశేష స్పందన లభించింది. 23 ఆంధ్రా బెటాలియన్, 05 కంపెనీ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ సెలక్షన్స్‌ను కళాశాల గ్రౌండ్‌లో గురువారం నిర్వహించారు. కళాశాల నుంచి 1000 మంది విద్యార్థినులు ఎంపికలకు హాజరయ్యారు. ఎంపికలో భాగంగా విద్యార్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌లు నిర్వహించారు. ట్రెనింగ్ జేసీవో సుబేదార్ బీహెచ్ఎమ్ రమేష్, లెఫ్టినెంట్ మేడికొండ రాజేష్‌బాబు ఆధ్వర్యంలో రన్నింగ్, షటిల్ రన్, పుషప్స్, ఫ్లెక్సిబిలిటీ, స్టామినా తదితర పరీక్షలు జరిగాయి. అనంతరం పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి నాయకత్వ నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పరీక్షించారు. ఈ పోటీలో ప్రతిభ, క్రమశిక్షణ, ఫిజికల్ ఫిట్‌నెస్ ఆధారంగా 80 మంది విద్యార్థినులను ఎంపిక చేశారు. వీరికి ఎన్‌సీసీ బేసిక్ ట్రెనింగ్ కార్యక్రమాలు ప్రారంభిస్తామని ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

